క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సూర్యనారాయణ మాస్టారు



విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సూర్యనారాయణ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మునగపాకలో మంగళవారం స్వర్గీయ వెలగా సూర్యనారాయణ మాస్టారు వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యనారాయణ ఎంతోమంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని అలాగే గోవాలమ్మ సంఘ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, సూర్యనారాయణ మాస్టారు భార్య అప్పలనరసమ్మ, కుమారులు జగన్నాథ రావు, వెంకటేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



మునగపాకలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మునగపాక : మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మేళతాళాలతో పాటు పూలమాలలు వేసి స్వామిని గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగించారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

డొంకాడలో గంగమ్మతల్లి జాతర



డొంకాడలో తీర్థ మహోత్సవం

నక్కపల్లి: సంక్రాంతి పండగ అంటే తిరునాళ్ల జాతరే.. గ్రామ గ్రామాన వారి వారి ఆచార వ్యవహారాల ప్రకారం తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు. పల్లెలు సాంస్కృతిక కార్యక్రమాల సందడితో పాటు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. మండలంలోని డొంకాడ లో కనుమ పండగను పురష్కరించుకుని గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో చిన్నారులు సందడి చేయగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీనివాసుడు, అలిమేలు మంగమ్మ, పద్మావతి అవతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు



కోనవానిపాలెం గ్రామంలో అక్షింతలు ఊరేగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో ఆయోధ్య రాముని అక్షింతలు భారీ ఊరేగింపు నిర్వహించి భక్తులకు అందజేశారు. సమరసత ఫౌండేషన్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అక్షింతలు ముందుగా శ్రీ సీతారామాలయంలో ఉంచి భక్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి భక్తులకు అక్షింతలు అందజేశారు. ఈ నెల 22 ఆయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటును పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో చిన్నికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



నక్కపల్లి : దేవవరంలో తోడపెద్దుకు పూజలు



మునగపాక : మంగళవరపు పేటలో సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు



ఎస్.రాయవరం : కె.వెంకటాపురంలో క్రీడల విజేతలకు బహుమతుల పంపిణీ

సందడిగా సంక్రాంతి సంబరాలు

- పిండివంటల ఘుమఘుమలు
- మొదలైన తిరనాళ్లు
- తోడపెద్దులకు ప్రత్యేక పూజలు



కోటవురట్లలో విజేతకు బహుమతి అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అనిత



కొక్కిరాపల్లిలో ఆకట్టుకున్న రంగవల్లులు

నక్కపల్లి: సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు సోమ, మంగళవారాల్లో అత్యంత ఘనంగా జరుపుకొన్నారు. సంక్రాంతి సందర్భంగా పల్లెలో సందడి నెలకొంది. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. సంక్రాంతి సందర్భంగా పిండివంటల ఘుమఘుమలు, కొత్తబట్టలు దరించిన చిన్నారులు, యువత, కుర్రకారు ఆటపాటలతో మునిగి తేలారు. సినిమాహాళ్లు కూడా ప్రేక్షకులతో రద్దీగా మారాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే సింహాద్రి అప్పన్నకు ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమలు, కానుకలు ఇచ్చి సత్కరించారు. హరిదాసులు, గంగిరెద్దుల వారి సందడి గ్రామాల్లో ఈ రెండు రోజులు బాగానే ఉంది. సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, చతుర్ముఖ పారాయణం కార్యక్రమాలు కూడా గుట్టుగా సాగిపోయాయి. పండక్కి స్వగ్రామాలకు వచ్చిన వారు కనుమనాడు తిరిగి వారివారి ఉంటున్న ప్రాంతాలకు వెళ్లడానికి బయలుదేరడంతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, రైల్వేస్టేషన్లు, బస్సులు రద్దీగా ఉన్నాయి.

మొదలయిన తీర్థాల సందడి...,

సంక్రాంతి సమయంలో ముఖ్యంగా చెప్పుకునేది తీర్థాలు (తిరునాళ్లు). సంక్రాంతి మొదలుకుని 15 రోజుల పాటు పలు చోట్ల తిరునాళ్లు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఆయా గ్రామాల్లో జరిగే తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతారు. ముఖ్యంగా నక్కపల్లి, ఒడ్డిమెట్ట, నామవరం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో తిరునాళ్లు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. తిరునాళ్ల సందర్భంగా తోడపెద్దు భజనలు, తప్పెట గుళ్లు, కోలాటాలు, జరిగాయి. కనుమ నాడు ఒడ్డిమెట్ట, ఉపమాకలో జరిగిన తిరునాళ్లకు వందలాది మంది హాజరయ్యారు. వివిధ రకాల వస్త్రాలను, మోడళ్లతో కూడిన రెడీమేడ్ డ్రెస్సులను ధరించిన కుర్రకారు సంక్రాంతి సంబరాల్లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మునగపాక : మంగళవరపుపేటలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పలు రంగాల్లో స్థిరపడిన 17మందిని ఘనంగా సత్కరించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ మాజీ కార్పొరేటర్ శరగడం చినప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, మొల్లేటి సరళ సత్యనారాయణ, పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, డాక్టర్ ఏఏ నాయుడు, గ్రంథాలయ నిర్వాహకులు ఏవీఎస్ మూర్తి, సంజీవరావు, ధనశ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : సంక్రాంతి, కనుమ వేడుకలు అంబరాన్ని అంటే విధంగా మండల వాసులు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో తీర్థ మహోత్సవం నిర్వహించారు. తీర్థంలో ఆట వస్తువులు ఏర్పాటుతో చిన్నారులు కేరింతలు కొట్టారు. వెంకటాపురం గ్రామంలో ముగ్గులు, ఈత పోటీలతో పాటు పలురకాల క్రీడలు నిర్వహించారు. సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం విజేతలకు బహుమతులు అందజేశారు.

కనుమను మంగళవారం రైతు సంప్రదాయ పండగ్గా జరుపుకొన్నారు. వ్యవసాయ దారులు దుక్కెటెద్దులు, బల్లను శుభ్రం చేసి పసుపుకుంకుమ బొట్లు పెట్టుకుని పూజలు నిర్వహించారు. పిట్లపాలెం, పెట్టుగోళ్లపల్లి తదితర గ్రామాల్లో తీర్థాలు నిర్వహించారు. రేవుపోలవరం తీరంలో పర్యాటకులు పోటెత్తారు.



సంక్రాంతి వేడుకను పురస్కరించుకుని రేవుపోలవరం తీరంలో పోటెత్తిన పర్యాటకులు



రామన్నపాలెంలో ముగ్గుల పోటీలు



రామన్నపాలెంలో కుర్చీలాట నిర్వహిస్తున్న దృశ్యం

సంబరాల లోగిళ్లు..ఊరూరా తిరనాళ్లు

యలమంచిలి రూరల్ : తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు పల్లెలు సందడిగా మారాయి. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో తెలుగు లోగిళ్లు సందడిని సంతరించుకున్నాయి. యలమంచిలి పట్టణంలోని పలు వీధులు, కాలనీలు సహా మండలంలోని పలు గ్రామాల్లో ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఇంటి ముంగిళ్లలో వేసిన ముగ్గులు నేలపై వాలిన హరివిల్లులా మెరిసాయి. పలుచోట్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో తీర్థాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద కోలాటాలు, నేలవేషాలు, రంగులరాట్నం, బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా కోడిపందాలు జరిగాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో మూడురోజుల సంక్రాంతి వేడుకలు ఆనందోత్సాహల నడుమ జరుపుకొన్నారు.

పేదలకు వస్త్రదానం

పట్టణంలోని ధర్మవరం వీధి కాపు సామాజిక వర్గానికి చెందిన సుమారు 200 మంది దాతలు చందాలు వేసుకుని వందలాది మందికి వస్త్రదానం చేశారు. స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరుపేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కొఠారు రామకృష్ణ, పందిరి రాము, మోటూరు వీరునాయుడు, నగిరెడ్డి శ్రీనివాసరావు, వీరన్నదొర, పుల్లా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఆటాపాటలతో పండగ

అచ్యుతాపురం: సంక్రాంతిని పురస్కరించుకొని పెద్దలు పత్రలు సమర్పించారు. పిల్లలు,పెద్దలు పండుగను పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. పలు గ్రామాల్లో తీర్థాలు నిర్వహించారు. జగన్నాథపురంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. రామన్నపాలెంలో తీర్థాన్ని పురష్కరించుకొని ముగ్గుల పోటీలు,కుర్చీల ఆటలు నిర్వహించారు.భోగాపురం గ్రామంలోనూ తీర్థం ఘనంగా నిర్వహించారు. శ్రీరాముల తీర్థాన్ని పురస్కరించుకొని మహిళా భక్తులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. కనుమ పండుగ రోజున అల్లుళ్ల రాకతో ఇళ్లన్నీ మరింత ఉత్సాహాన్ని కలిగించాయి. అచ్యుతాపురం, దోసూరు, తంతడి, పూడిమడక, జగన్నాథపురం, హరిపాలెం, తిమ్మరాజుపేట, ఖాజీపాలెం గ్రామాల్లో సంక్రాంతి, కనుమ ఘనంగా నిర్వహించారు.



యలమంచిలి మున్సిపాలిటీ పరిధి అగ్రహారంలో ముగ్గుల పోటీలు



యలమంచిలి పట్టణం వైఎస్సార్ కూడలి వద్ద పేదలకు దుస్తుల పంపిణీ



యలమంచిలి రూరల్ : డూడూ బసవన్న సందడి



ఎం.జగన్నాథపురంలో ముగ్గుల పోటీలు

తంగేడులో ముగ్గుల పోటీలు

కోటవురట్ల: మకర సంక్రాంతి, కనుమ పండగలను మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. బంధుమిత్రుల రాకతో లోగిళ్లు సందడిగా మారాయి. కనువిందు చేసే రంగవల్లికలు పల్లెలకు ప్రత్యేకాకర్షణను తీసుకురాగా హరిదాసుల సంకీర్తనలు సరికొత్త శోభను తీసుకొచ్చాయి. తంగేడులో మకర సంక్రాంతి రోజున ముగ్గుల పోటీ నిర్వహించారు. కోటవురట్లలో కనుమ రోజున రంగవల్లికలు, కోలాటం పోటీ నిర్వహించారు. రంగవల్లికల పోటీలో జవ్వాది కుమారి ప్రథమ స్థానంలో నిలవగా మైక్రోవోవెన్‌ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే అనిత పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, కుటుంబ సభ్యులు

రాంబిల్లి : సేవా కార్యక్రమాలతో మానసిక తృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. రాంబిల్లిలో సోమవారం ఆయన బావ సత్యంరాజు, సోదరి నారాయణమ్మ జ్ఞాపకార్థం 1100 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా పేదలకు వస్త్రదానం చేస్తుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దంపతులు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొప్పుగొండుపాలెంలో సర్పంచ్ వితరణ

కొప్పుగొండుపాలెం సర్పంచ్ బద్ది హరిబాబు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బద్ది మూలస్వామి పాల్గొన్నారు.

మునగపాక : తన తల్లి అచ్చియ్యమ్మ జ్ఞాపకార్థం మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు సోదరులు సంక్రాంతి పర్వదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సాయిబాబా ఆలయంలో భోజన సదుపాయం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో 150 మంది, దళితవాడలో 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్పారావు సోదరులు నూకరాజు, దళితవాసు లు పాల్గొన్నారు.



మునగపాకలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పారావు సోదరులు



కొప్పుగొండుపాలెంలో దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ హరిబాబు

ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రత్యేక పూజలు

- ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి
- వైభవంగా స్వామివారికి తిరువీధి సేవ



ఉపమాకలో స్వామివారి ఊరేగింపు

నక్కపల్లి : ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతినాడు ప్రత్యేక పూజలు జరిగాయి. గరుడాద్రి పర్వతంపై కల్కిఅవతారమైన స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున నాలుగు గంటలకు పంచామృతాలతో ప్రత్యేక అభిషే కం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తిచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన వేణుగోపాలస్వామి ఆలయంలో, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను స్వామివారు ఉత్సవమూర్తుల వద్ద నిత్య సేవాకాలం, ప్రసాద నివేదన నిత్యహోమం, బలిహరణలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థగోష్టి జరిగాయి. అనంతరం శ్రీ పద్మావతి, అలువేలుమంగా సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని రాజాధిరాజవాహనంలో, ఆండాళ్లమ్మ వారిని శేషతల్ప వాహనంలో తిరువీధి సేవలు నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచారపరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల కోలాటం, సంకీర్తనలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
- వేడుకగా కొణతాల రామలింగస్వామి పురస్కార్-2024 అవార్డులు



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

అనకాపల్లి : దేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, నేటి యువత సంప్రదాయాలను కొనసాగించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక రావుగోపాలరావు రహదారి ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్-2024 ప్రదానోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలుగుభాష గొప్పతనం గురించి వివరించారు. సంఘ సేవా తత్పరులకు ప్రపంచమే ఒక కుటుంబమన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ పేరుమీద నాలుగేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వ్యక్తులకు అవార్డులతో అభినందించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఉపాధ్యాయ రంగంలో చిలుకూరి శ్రీనివాసరావుకు, ఉత్తమ విద్యార్థి రంగంలో విల్లూరి భార్గవ్, సంఘ సేవకులకు పి.సత్య తిరుపతిరావు పట్నాయక్, రాపర్తి జగదీష్‌కుమార్, మార్గం రాజేష్, సురకాసి రవితేజ, జీరెడ్డి తరుణ్‌కుమార్ అవార్డులతో సత్కరించారు. ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడులు



ఎస్.రాయవరంలో కోడిపందాలు

ఎస్.రాయవరం : సంక్రాంతి, కనుము రోజున పేకాట, కోడిపందాలు ఆడుకునేవారిని పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఎస్ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. వేమగిరి గ్రామంలో కోడిపందాలపై దాడి చేసి 6 కోళ్లు, ఇద్దరు నిందితులను, దార్లపూడి గ్రామంలో రెండు కోళ్లతో పాటు ఒకరిని పట్టుకున్నామని, ఎస్.రాయవరంలో ఒక కోడి, 6 లాటరీ బల్లలను పట్టుకుని సీజ్ చేశామని తెలిపారు. అలాగే అడ్డురోడ్డులో 6 మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

ఊరూరా తిరునాళ్లు



కట్టుబోలులో బాల సన్యాసమ్మకు పూజలు



దిమిలిలో భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత

రాంబిల్లి : సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా మండలంలో తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంధర్బంగా సోమవారం దిమిలిలో సంతోషిమాత, లోవపాలెంలో పరశురామన్న తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కట్టుబోలులో కనుమ పండగ సందర్బంగా మంగళవారం బాల సన్యాసమ్మ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ, బంధు మిత్రులతో కలిసి తీర్థాల్లో జనం సందడి చేశారు. రంగుల రాట్నాలు ఎక్కి ముచ్చట తీర్చుకున్నారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు చేస్తూ తీర్థాల్లో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. ముగ్గులు, ఆటలు , పాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

జిల్లా స్థాయి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



ముగ్గుల పోటీల విజేత జగదీశ్వరికి బహుమతి అందజేస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆకాంక్షించారు. కనుమ పండగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు ఆర్థిక సహకారంతో నందీశ్వర తులసీ కళా వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ముగ్గుల పోటీల్లో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని పీలా జగదీశ్వరి, ద్వితీయ బహుమతిని టెక్కలి శాంతి, తృతీయ బహుమతి గెద్దం దేవీకుమారి, చతుర్ధ బహుమతిని ఆడారి భవాని గెలుచుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, నిర్వాహకులు మళ్ల సంజీవరావు, కిష్టప్ప,పెంటకోట శ్రీనివాసరావు(నెట్), కేవీఎస్ అప్పారావు , ఆడారి రమణబాబు పాల్గొన్నారు.

సేవ చేసే గుణం చాలా గొప్పది



కైలాసపట్నంలో నిత్యావసర సరుకులను అందిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: సేవా భావం గొప్ప అనుభూతిని ఇస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. శ్రీబండిమాంబ వర్తక సేవా సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆయన మిత్రుడు విశాఖకు చెందిన శ్రీలలితా ప్లాస్టిక్స్ అధినేత శాంతిలాల్ పుగిలియా, లలిత దంపతులు మకర సంక్రాంతిని పురస్కరించుకుని కోటవురట్ల, కైలాసపట్నం, రాట్నాలపాలెం గ్రామాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పంచదార, కందిపప్పు, పెసరపప్పు, బెల్లం, ఆయిల్, స్వీట్ బాక్స్, రైస్ బ్యాగ్, కూరగాయలను జెడ్పీటీసీ ఉమాదేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ శాంతిలాల్ పుగిలియా మన మండలంలో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, బత్తుల మాణీలు, తుమ్మలపల్లి బాబూరావు, బత్తుల సతీష్ పాల్గొన్నారు.